క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జుమ్మిలాల్


జుమ్మిలాల్

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా గుండెపురి ఎంపీటీసీ ధరావత్ జుమ్మిలాల్‌ను ప్రకటించారు. గురువారం జుమ్మిలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యూత్ జోడో-బూత్ జోడో'


రావులపల్లిలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో గురువారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూత్ జోడో-బూత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగిరెడ్డి మమత, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొమ్ము జోహార్, సర్పంచ్ వయ్య యాదమ్మ, సుధాకర్, చింతకుంట్ల హరీష్, సతీష్, మహేష్, అంజి, మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు


హైదరాబాద్‌లో రాజేశ్వర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న దుర్గం ప్రభాకర్

భానుపురి : తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన మాజీ క్రిస్టియన్ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావును హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి జాకబ్ రాజ్, జయంత్, మాణిక్యరావు, ఆర్.యోహాను, యం.ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తిరుమలగిరి : తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థి, తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సాత్విక్‌కు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ ఫీజు నిమిత్తం ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మండడి పద్మారెడ్డి, కార్యదర్శి లక్ష్మయ్య, కోశాధికారి సురేష్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, రామచంద్రు గౌడ్, నరేందర్, శ్రీనివాస్, మురళీ, రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన బోయిని లింగమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతురాలి భౌతిక కాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే తుంగతుర్తికి చెందిన నల్లనాగుల దేవేందర్ ఇటీవల అనారోగ్యంతో చెందటంతో ఆయన కటుంబాన్ని పరామర్శించి, రూ.5,000ల నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, గోపగాని శ్రీనివాస్, కటకం వెంకటేశ్వర్లు, భిక్షం, సంతోష్, సూరయ్య, రవికుమార్, భాస్కర్, చెరుకు పరమేష్, జలేందర్, వెంకన్న, సాయికిరణ్, సురేష్, రవి, అనిల్, భిక్షం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

సూర్యాపేటటౌన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ భారతి, వెంకటయ్య, వెంకన్న, పాపిరెడ్డి పాల్గొన్నారు.

అందని బిల్లులు.. అప్పుల్లో ఏజెన్సీలు

- పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు 10 నెలలుగా రాని బిల్లులు
- నాలుగు నెలల గౌరవ వేతనాలు కూడా పెండింగ్‌లోనే..
- అప్పుల పాలవుతున్నామని నిర్వాహకుల ఆవేదన

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద పిల్లలు ఆరోగ్యంగా ఉండటానికై పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. అయితే ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించే ఏజెన్సీలకు నెల నెలా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. గత 10 నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అప్పుల పాలవుతున్నామని ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీహెచ్ఎస్‌లలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం బిల్లులు గతేడాది అక్టోబర్ నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే మండల వ్యాప్తంగా ఏజెన్సీ నిర్వాహకులకు గత మూడు నెలల నుంచి గౌరవ వేతనాలు రావాల్సి ఉంది.


అర్వపల్లిలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండంలో మొత్తం 32 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో ఆరు జెడ్పీహెచ్ ఎస్‌లు ఉన్నాయి. అందులో 8, 9, 10 తరగతులకు చెందిన సుమారు 800 మంది విద్యార్థిని, విద్యార్థులకు సంబంధించిన 10 నెలల బకాయి బిల్లులు ఏజెన్సీలకు రావాల్సి ఉంది. అలాగే ఏప్రిల్, జూన్, జూలై నెలల గౌరవ వేతనాలు కూడా మండలంలోని 59 మంది ఏజెన్సీ నిర్వాహకులకు రావాల్సి ఉందని ఏజెన్సీ మహిళలు చెబుతున్నారు. ఇక కోడిగుడ్ల బిల్లులు కూడా 7 నెలలవి రావాల్సి ఉంది.

రూ. 3.50 లక్షల వరకు బిల్లులు రావాలి



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ ఏజెన్సీకి గతేడాది నుంచి ఇప్పటి వరకు సుమారు 7 నెలల బిల్లులకు సంబంధించి సుమారు రూ.3.50 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. అప్పులు చేసి సరుకులు తెచ్చి పిల్లలకు భోజనాలు అందించాం. వెంటనే బకాయి బిల్లులను విడుదల చేయాలి.

– బైరు సంధ్య, ఏజెన్సీ నిర్వాహకురాలు, అర్వపల్లి

బిల్లులు చేసి పంపాం



మధ్యాహ్న భోజన పథకాని కి సంబంధించి 8,9,10 తరగతుల విద్యార్థుల భోజన బిల్లులు ఎప్పటికప్పుడు చేసి పై అధికారులకు, ఎస్టీఓకు పంపిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే ఏజెన్సీల ఖాతాలలో జమచేస్తాం.

– బాలునాయక్, ఎంఈఓ

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం


అంబులెన్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తోందని తుంగతుర్తి శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. గురువారం తిరుమలగిరిలో తుంగతుర్తి నియోజకవర్గానికి వచ్చిన మూడు అంబులెన్సులు (108), ఒక అమ్మ ఒడి వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య తెలంగాణ సాధన, ఎమర్జెన్సీ సేవలను పటిష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి


కాంగ్రెస్ పార్టీలోకి యువకులను ఆహ్వానిస్తున్న రాంరెడ్డి దామోదర్ రెడ్డి

భానుపురి : కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు కడుపు నింపేలా అసలైన అభివృద్ధి జరుగుతుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చివ్వెంల మండలం రోళ్లబండతండా గ్రామానికి చెందిన దాదాపు 100 మంది బానోతు మహేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బంగారు తెలంగాణ కల సాకారం అవుతుందని భావించిన యువతకు కేసీఆర్ ప్రభుత్వం నిరాశే మిగిల్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కొప్పుల వేణారెడ్డి, జిల్లా సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ ఆలేటి మాణిక్యం, బానోత్ మహేందర్, నర్సింహ, సాయి, ఉపేందర్, నరేష్, శరత్, భరత్ చంద్ర, గణేష్, భరత్, రాము, మదార్, నరేష్, అరుణ్, తరుణ్, మాలోతు గాంధీ, మాలోతు చిట్టిబాబు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ హర్షణీయం


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్చకుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, సూర్యాపేటలో శ్రీవైష్ణవ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం హర్షణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులు నల్లాన్ చక్రవర్తుల రామానుజ చార్యులు, వెంకటరమణమ్మల స్మారకార్థం శ్రీవైష్ణవ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాల చార్యులు, శ్రీనివాసాచార్యులు, మురళీధరాచార్యులు, పవన్‌కుమారచార్యులు, సంఘర్షణాచార్యులు, హరిచందనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో అభివృద్ధి

భానుపురి : జిల్లాలోని ప్రతి గ్రంథాలయాన్ని మంత్రి జగదీష్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ బడ్జెట్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి సీతారామశాస్త్రి, డీఈఓ అశోక్, డీపీఓ యాదయ్య, గ్రంథాలయ డైరెక్టర్లు రవీందర్‌రావు, రియాజుద్దీన్, రంగారావు, శ్రవణ్ పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా బొల్లెద్దు వినయ్ తొలగింపు

భానుపురి : రాష్ట్ర కమిటీ ఆదేశాలను ఉల్లంఘిస్తున్న మాలమహానాడు సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొల్లెద్దు వినయ్‌ని జిల్లా అధ్యక్ష పదవి నుంచి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తళ్లమళ్ల హస్సేన్ ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడి ఎన్నిక త్వరలోనే ఉంటుందని, నూతన కమిటీ నిర్మాణం అయ్యేవరకు తాత్కాలికంగా సంఘం జిల్లా ఇన్‌చార్జ్‌గా బోయిళ్ల అఖిల్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయం


30వ వార్డులో యూత్ డిక్లరేషన్‌ను వివరిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, తదితరులు

భానుపురి : ప్రజలకు పొర్లుదండాలు పెట్టి నూటొక్క ప్రదక్షిణలు చేసినా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, త్వరలోనే ఆ పార్టీ ఖాళీ కావడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 30వ వార్డులో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకుడు దొంతిరెడ్డి సైదిరెడ్డి, విజయ్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడారు. రేవంత్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ము లేక బీఆర్ఎస్ నాయకులు చిల్లర విమర్శలు చేస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని తెలిపారు. అనంతరం పుప్పాల వేణు, ఆనంద్, నామా వేణుల ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్ననాయక్, షఫీఉల్లా, నామా ప్రవీణ్, స్వామినాయుడు, ఫరూక్, శనగాని రాంబాబు, పి.కృష్ణ, నేరేళ్ల మధు, వల్దాసు దేవేందర్, రాచకొండ దేవయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలకాలి

పెన్‌పహాడ్ : తెలంగాణ ప్రజలను మాయ మాటలతో మోసం చేసిన బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలకాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి రత్యాతండాలో వివిధ పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాజా, గోదల రంగారెడ్డి, బచ్చుపల్లి నాగేశ్వర్‌రావు, బెల్లంకొండ శ్రీరాములు, యాట ఉపేందర్, భూక్య రాజు, సామ సురేందర్‌రెడ్డి, నేరేళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

పెన్‌పహాడ్ : రేషన్ డీలర్ల కమీషన్ పెంపు, రూ.5లక్షల ఇన్సూరెన్స్, కరోనా సమయంలో మృతి చెందిన డీలర్ల స్థానంలో కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించడాన్ని హర్షిస్తూ మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మి, చెన్నారెడ్డి, రౌతు రాము, అలివేలు, విజయలక్ష్మి, రమ్య, రాజు పాల్గొన్నారు.

కార్మికరంగ సమస్యల పరిష్కారంలో విఫలం


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తుంగతుర్తి : కార్మిక రంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాజారామ్ అన్నారు. కార్మిక రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని అన్నారు. అసంఘటిత కార్మికులకు పని భద్రత కల్పించి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ హరిశ్చప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బొంకురి శ్యామ్‌సుందర్, కోట రామస్వామి, మల్లెపాక లక్ష్మయ్య, నర్సయ్య, రాచకొండ వెంకన్న, ఎస్‌కే. అజ్గర్, సైదులు, ఆంధ్రయ్య, లింగమల్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సవరించాలని వినతి


తిరుమలగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తిరుమలగిరి : గృహలక్ష్మి పథకం అమలులో నిబంధనలు సవరించాలని భారతీయ జనతా పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ లక్ష్మి పథకం కోసం రేషన్ కార్డు నిబంధన తొలగించాలని కోరారు. దరఖాస్తు ప్రక్రియ నిరంతరం సాగాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అధికారులు క్షేత్ర స్థాయి విచారణ జరిపి రాజకీయాలకు అతీతంగా పథకాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వై.దీన్‌దయాళ్, సోమయ్య పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తు గడువు పొడిగించాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పొడిగించాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకారపు రమేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన నిరుపేదలందరికీ ఎలాంటి షరతులు లేకుండా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. దరఖాస్తుల గడువు కేవలం మూడు రోజులు మాత్రమే ఇచ్చి మరోసారి ప్రభుత్వం నిరుపేదలను మోసం చేస్తోందన్నారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు పులుసు శేఖర్, బొంకూరి అజయ్, లింగరాజు, వెంకన్న, స్వామి తదితరులు ఉన్నారు.

సాయి మందిరంలో అన్నదానం

కోదాదరూరల్ : మండలంలోని అశోక్‌నగర్‌లో గల సాయి మందిరంలో పట్టణానికి చెందిన చెరకు అశోక్‌గౌడ్ –కవిత దంపతులు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవై విష్ణు, వాచేపల్లి శ్రీనివాసరెడ్డి, లావుడ్యా బాలు, చిరంజీవి, నారాయణరావు, మర్ల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్‌ల పంపిణీ

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం, సిరిపురం గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ ఫౌండేషన్ ప్రతినిధి బుర్రా పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోధకాలు నిర్మూలనకు కృషి చేయాలి

నడిగూడెం : బోధకాలు నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న కోరారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బోధకాలు వ్యాధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్, డీఈసీ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్.హరినాథ్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- రిటైర్డు హోంగార్డుకు సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు సయ్యదొద్దీన్‌ను సూర్యాపేటలో సన్మానిస్తున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

వైభవంగా బోనాల వేడుకలు


అర్వపల్లి : కుంచమర్తిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న ఎంపీపీ, సర్పంచ్, తదితరులు


నాగారంలో బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు


నాగారం : నర్సింహులగూడెంలో..

అర్వపల్లి : మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్య యాదవ్, సర్పంచ్ ఉపేంద్రలింగరాజు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. అలాగే తిమ్మాపురంలో బోనాల వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో వైస్ఎంపీపీ మారిపెద్ది భవానిశ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని నాగారం, నాగారంబంగ్లా, పసునూర్, వర్ధమానుకోట, ఈటూరు, మాచిరెడ్డిపల్లి, డి.కొత్తపల్లి, పేరబోయినగూడెం, నర్సింహులగూడెం, లక్ష్మాపురం తదితర గ్రామాల్లో గురువారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోనాలను అలంకరించుకొని డప్పుచప్పుళ్లతో పురవీధుల గుండా ర్యాలీగా ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.


అర్వపల్లి : తిమ్మాపురంలో..

నూతనకల్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో బోనాల పండుగను గురువారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. బోనాలతో గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, సర్పంచ్ కనకటి సునీత, వైస్ఎంపీపీ జక్కి పరమేష్, తదితరులు పాల్గొన్నారు.


నూతనకల్ : మిర్యాలలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు


కాసరబాదలో..

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి


తుంగతుర్తిలో మాట్లాడుతున్న రాజారాం

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోతు రాజారామ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలకు మద్దతు తెలిపి మాట్లాడారు. రెండో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించి, తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో 2వ ఏఎన్ఎంలు కష్టపడి పనిచేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు భారతి, స్వప్న, కమల, రమ, జయమ్మ, బేబి, రజిత, స్వాతి పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

తిరుమలగిరి : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని కోరుతూ వారు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గత 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నా తమను రెగ్యులరైజ్ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, మాధవి, వెంకటమ్మ, యశోద, రజిత పాల్గొన్నారు.

అర్వపల్లి : తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండంలోని రెండో ఏఎన్ఎంలు గురువారం అర్వపల్లి పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు విజయశాంతి, నాగరాణి, శకుంతల, ఊర్మిళ, గిరిజ, శ్వేత పాల్గొన్నారు.

సమకూరని క్రీడా సామగ్రి

- గ్రామాల్లో నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణాలు
- సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఆసక్తి చూపని గ్రామీణ యువత
- ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు మొలుస్తున్నా పట్టించుకోని అధికారులు

చివ్వెంల : గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలని ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా గ్రామానికో క్రీడా ప్రాంగణాన్ని నిర్మించింది. కాని క్రీడా ప్రాంగణాల్లో క్రీడలు నిర్వహించకపోవడంతో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు క్రీడా పరికరాలు తీసుకురాలేదు. క్రీడా సామగ్రిని డీఆర్‌డీఏ ద్వారా సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ఏ శాఖ ద్వారా సమకూర్చలేదు,

ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు..

మండలంలో 31 గ్రామాలకు గాను 11 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. చివ్వెంల, అక్కలదేవిగూడెం, బి.చందుపట్ల, బీమ్లాతండా, గాయంవారిగూడెం, గుంజలూరు, ఎంజీ నగర్ తండా, పాండ్యానాయక్ తండా, రోళ్లబండ తండా, జి.తిర్మలగిరి, తుల్జారావుపేట గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తి చేశారు. మిగిలిన గ్రామాల్లో పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. కానీ ఏ ఒక్క క్రీడా ప్రాంగణంలో పరికరాలు ఏర్పాటు చేయలేదు. క్రీడా పరికరాలు లేక క్రీడా ప్రాంగణాలు చిన్నబోతున్నాయి. ప్రాంగణాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి.



చివ్వెంలలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

టార్గెట్ కోసమేనా..?

పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టాల్సిన పనులు, టార్గెట్‌లో భాగంగా క్రీడా ప్రాంగణాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏర్పాటు చేశారు. టార్గెట్ కోసం తంటాలు పడ్డారు. కొన్ని గ్రామాల్లో పాఠశాల ప్రహరీ వద్దనే తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం అంటూ బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతే ఇప్పటి వరకు మైదానం ఏర్పాటు చేసింది లేదు. ఆటలు ఆడింది లేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే క్రీడా పరికరాలను సరఫరా చేసి, క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

సామగ్రి వచ్చింది



క్రీడా ప్రాంగాణాల్లో కావాలిస్న క్రీడా సామగ్రి వచ్చింది. కొన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రాంగణాల్లో బిగించాల్సి ఉంది. త్వరలో క్రీడా ప్రాంగణాల్లో పరికరాలు బిగించి క్రీడాకారులు క్రీడలు ఆడేలా ఏర్పాట్లు చేస్తాం.

– ఇరుగు నాగయ్య, ఏపీఓ, చివ్వెంల